
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
బుధవారం 21 ఆగస్టు 2024



## ఖేడ్ ఆర్టీసీ డిపోకు రాఖీ పండుగ

నారాయణఖేడ్, ఆగస్టు 20: ఖేడ్ ఆర్టీసీ డిపోకు రాఖీ పౌర్ణమి నిజమైన పండుగను తీసుకువచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సోమవారం రూ.18,30,388 లక్షల ఆదాయం వచ్చిందని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. రాఖీని పురస్కరించుకొని అదనపు చార్జీలు విధించకుండా ప్రత్యేక బస్సులను నడిపామన్నారు. డిపో ఏర్పాటు చేసిన నాటి నుంచి ఒక్కరోజే ఇంత మొత్తంలో ఆదాయం రావడం ఇదే మొదటిసారని అన్నారు.

# ఫొటోగ్రాఫర్లకు నిర్మలాజగ్గారెడ్డి సన్మానం

సంగారెడ్డిరూరల్, ఆగస్టు 20 : సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని ఫొటోగ్రాఫర్లను నిర్మలాజగ్గారెడ్డి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతీ పనికి సమయ పరిమితి ఉంటుందని, ఒక్క ఫొటో జర్నలిస్టుకు మాత్రం సమయ పరిమితి లేకుండా.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పని చేస్తూనే ఉంటారని చెప్పారు. సమాచారాన్ని అందించడం, అవగాహన కల్పించడం, సమాజాన్ని ప్రశ్నించడం, మధుర స్మృతులు అందించడం, చరిత్రను చూపడం ఒక్క ఫొటోగ్రఫీకే సాధ్యమని తెలిపారు. ఫొటో జర్నలిస్టులు ఆర్థికంగా ఎంతో వెనుకబడ్డారని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.



ప్రపంచ ఫొటోగ్రఫీ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

### ఓటు హక్కు నమోదుకు

# మరో అవకాశం

**వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి.. ▸ బూత్ లెవల్‌లో ఇంటింటి సర్వే**




మెదక్, ఆగస్టు 20: ఓటుహక్కు నమోదు, ఓటరు జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పించింది. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించేందుకు సంకల్పించింది. స్పెషల్ సమ్మరీ రివిజన్- 2024లో భాగంగా ఓటరు జాబితా రూపొందించనున్నారు. ఇప్పటి వరకు ఓటుహక్కు లేని వారంతా ఫారం- 6 దరఖాస్తును స్థానిక బీఎల్‌వోలకు అందజేయాల్సి ఉంటుంది. ఓటరు జాబితా రూపకల్పన కోసం మంగళవారం నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటి సర్వే జరుపుతున్నారు. ఇప్పుడున్న జాబితాలో పేర్లు ఉన్నవారు వేరే చోటికి వెళ్లారా.. లేదా మరణించారా, తదితర వివరాలను తెలుసుకుంటారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, జాబితా నుంచి పేర్లు తొలగించేందుకు అవకాశం కల్పించారు. జాబితాలో నాణ్యమైన ఫొటో ఉండేలా చూస్తారు. జాబితాలో పేరు పొందుపర్చని పక్షంలో వారి నుంచి దరఖాస్తు స్వీకరిస్తారు. వీటితో పాటు పోలింగ్ కేంద్రాల హద్దులు నిర్ణయిస్తారు. ఓటరు జాబితా ముసాయిదాను అక్టోబరు 29 ప్రకటిస్తారు. జాబితా ప్రకటించిన తర్వాత అక్టోబరు 29 నుంచి నవంబరు 28 వరకూ సవరణలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటిని మరోసారి క్షేత్రస్థాయిలో డిసెంబరు 12 వరకు పరిశీలిస్తారు. 2025 జనవరి 1న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆమోదానికి ఓటరు జాబితా పంపిస్తారు. జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

## విద్యాశాఖలో ముగ్గురి సస్పెన్షన్

**▸ ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో**

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20 : జిల్లా విద్యాశాఖలో ముగ్గురిపై సస్పెన్షన్ వేటు పడింది. హత్నూర మండలం ఐటీఐ కాలనీ ఎంపీపీఎస్ ఎస్జీటీ ఉపాధ్యాయుడు శ్రీరాములును సస్పెండ్ చేస్తూ డీఈవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11.30 గంటల వరకు కూడా పాఠశాలను తెరవకుండా, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా పాఠశాలకు గైర్హాజరైనందున సస్పెండ్ చేశారు. సిర్గాపూర్ మండల కేజీబీవీలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకపోవటం, విద్యార్థులు, ఉపాధ్యాయులతో దురుసుగా ప్రవర్తించటం, విద్యార్థులకు జరిమానాలు విధించడం తదితర కారణాల చేత సంబంధిత కేజీబీవీ ప్రత్యేకాధికారి కె.లలితను విధుల నుంచి తొలగించినట్లు డీఈవో ప్రకటించారు. అలాగే, గత జూన్ 24 నుంచి అనుమతి లేకుండా పాఠశాలకు వరుసగా గైర్హాజరవడంతో విద్యార్థులు సబ్జెక్ట్ పరంగా నష్టపోయిన కారణాల నేపథ్యంలో అందోల్ కేజీబీవీలో పీజీసీఆర్‌టీ నర్సింగ్ ఎన్.పి. ప్రియాంకను కూడా విధుల నుంచి తొలగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## 13 మంది ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 20: సంగారెడ్డి జిల్లాలో 13 మంది ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ మల్టీ జోన్- 2 ఐజీ వి.సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 31 మంది ఏఆర్ కానిస్టేబుళ్లకు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన వారంతా వెంటనే తమ తమ విధుల్లో వెంటనే చేరాలని ఆయన ఆదేశించారు.

**ఎస్ఐలుగా పదోన్నతి పొందిన వారు..**

రాములు, ఎన్.శ్రీనివాస్‌రావు, జి.నారాయణ, సీహెచ్.శివ్వయ్య, హబీబిన్ రహమాన్, పి.నర్సిములు, ఎం.ఎ.రషీద్, డి.శ్రీనివాస్, హెచ్.శ్యామలరావు, ఎస్‌కె ముక్తార్, ఎం.డి.జాహంగీర్, ఎం.సుధాకర్, జి.నర్సింహ్మారాజు.

### ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు

## దరఖాస్తు చేసుకోవాలి

**▸ పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు నమోదు చేయాలి**

**▸ మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**

మెదక్ అర్బన్, ఆగస్టు 20: ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు జిల్లాలోని విద్యార్థులు నామినేషన్లు నమోదు చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత గల అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు నామినేషన్లు అప్‌లోడ్ చేసి జిల్లా నుంచి ఎక్కువ మంది ఎంపిక కావాలన్నారు. ప్రతీ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి ఐదు దరఖాస్తులను వచ్చే నెల 15 లోపు అప్‌లోడ్ చేయాలని, ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాష్ట్రస్థాయి మహిళల ఫుట్‌బాల్ రన్నర్‌గా మెదక్ జిల్లా జట్టు ఎంపిక కావడం పట్ల మంగళవారం క్రీడాకారులను కలెక్టర్ రాహుల్‌రాజ్ అభినందించారు. వీరితోపాటు జాతీయ స్థాయిలో జూనియర్ ఫుట్‌బాట్ విభాగంలో బంగారు పతకం సాధించిన అంకిత్‌ను కూడా కలెక్టర్ ఈసందర్భంగా అభినందించారు.



ఇన్‌స్పైర్ మనక్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

### త్రిబుల్ ఆర్‌కు

# నో ట్రబుల్..!



రెడ్డిపల్లిలో సర్వేకు వెళ్లిన అధికారులను అడ్డుకుని బైఠాయించిన రైతులు (ఫైల్)

**జిల్లాలో భూసేకరణ పూర్తికి అడుగులు**

**▸ గ్రామాల్లో సర్వే పూర్తి**

**▸ వ్యతిరేకిస్తున్న గ్రామాల్లో రికార్డుల ఆధారంగా సేకరణ**

**▸ డిక్లరేషన్ చేసి.. పూర్తి చేయాలని నిర్ణయం**

నర్సాపూర్, ఆగస్టు 20: ప్రభుత్వం త్రిబుల్ ఆర్ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో మెదక్ జిల్లాలో అధికారులు భూసేకరణను వేగవంతం చేస్తున్నారు. జిల్లాలో నర్సాపూర్ డివిజన్‌తోపాటు తూప్రాన్‌లో భూసేకరణ చేయాల్సి ఉంది. నర్సాపూర్ డివిజన్‌లోని 17 గ్రామాల్లో త్రిబుల్‌ఆర్ కోసం ఇప్పటికే 16 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి, రైతుల ఆమోదం పొందగా, ఒక్క గ్రామ రైతులు మాత్రం భూసేకరణకు ససేమిరా అంటున్నారు. దీంతో ఆ గ్రామ రైతుల ప్రమేయం లేకుండా రికార్డుల ఆధారంగా భూములను నిర్ణయించి డిక్లరేషన్ చేసి, భూసేకరణ పూర్తి చేయాలని నిర్ణయించారు.

జిల్లాలోని నర్సాపూర్, తూప్రాన్ డివిజన్లలో త్రిబుల్ ఆర్ కోసం భూసేకరణ చేయాల్సి ఉంది. ఇందులో నర్సాపూర్ డివిజన్‌లోని మొత్తం 17 గ్రామాల గుండా త్రిబుల్ రోడ్డు వెళ్లేలా అధికారులు అలైన్‌మెంట్ రూపొందించారు. ఇందు కోసం 752.48 ఎకరాల భూమి సేకరించాలని నిర్ణయించారు. నర్సాపూర్ మండలంలోని నాగుపల్లిలో 11.82 ఎకరాలు, మూసాపేటలో 76.70 ఎకరాలు, మహ్మదాబాద్‌లో 43.12, పెద్దచింతకుంటలో 62.49, కాజీపేటలో 16.59, తిర్మలాపూర్‌లో 44.10, తుజాల్‌పూర్‌లో 52.25, రెడ్డిపల్లిలో 34.45, చిన్నచింతకుంటలో 34.45 ఎకరాల చొప్పున సేకరించనున్నారు. శివ్వంపేట మండలంలో లింగోజిగూడలో 36.07 ఎకరాలు, కొత్తపేటలో 51.61, పాంబండలో 36.85, ఉసిరికపల్లిలో 18.82, పోతులబోగుడలో 44.08, గుండ్లపల్లిలో 33.84, రత్నాపూర్‌లో 100.32, కొంతాన్‌పల్లిలో 69.54 ఎకరాల చొప్పున రైతుల నుంచి తీసుకోనున్నారు. ఇందులో 16 గ్రామాలలో మొదట్లో కొన్ని అడ్డంకులు ఎదురైనా, అధికారులు రైతులకు నచ్చజెప్పి భూసేకరణకు సర్వే పూర్తి చేశారు. అయితే, ఒక్క రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు మాత్రం ఎన్ని సార్లు సర్వేకు వెళ్లినా ససేమిరా అంటూ అధికారులను అడ్డుకుని తిప్పి పంపుతున్నారు. చివరకు ఆర్డీవో, అదనపు కలెక్టర్ స్థాయి అధికారులు వెళ్లినా రైతులు వినలేదు. దీంతో చేసేదేమీ లేక రికార్డుల ఆధారంగా గ్రామ భూములను సేకరించాలని నిర్ణయించారు. తూప్రాన్‌లో ఎనిమిది గ్రామాల్లో మొత్తం 434 ఎకరాలు సేకరించనున్నారు. ఇక్కడ తమకు పరిహారం ఏ మాత్రం అందుతుందో అన్న ఆందోళన రైతుల్లో ఉంది.

**పరిహారం కోసం కలెక్టర్ కమిటీ**

త్రిబుల్ ఆర్ కోసం సేకరించనున్న రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఎకరాకు రూ. 15 లక్షలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కానీ, ఇక్కడ మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ. 50 లక్షలకు తక్కువ పలకడం లేదు. రైతులు కూడా తరతరాలుగా భూములను నమ్ముకుని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం తమ భూములు తీసుకుంటే న్యాయం జరగదన్న ఆందోళనలో ఉన్నారు. సర్వేకు వచ్చిన అధికారుల ఎదుట ఇదే విషయాన్ని వారు స్పష్టం చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్ రైతులకు పరిహారం విషయంలో జిల్లా కమిటీని వేశారు. ప్రభుత్వం సేకరించే భూముల ధరలు పెంచే అవకాశం ఏ మేరకు ఉందో పరిశీలించి, నిర్ణయించాలని సూచించారు. అయితే, ఈ కమిటీ ఇప్పటి వరకు ఎలాంటి కార్యచరణ చేపట్టిన దాఖలాలు లేవని ప్రచారం జరుగుతున్నది. ఇక్కడ ప్రభుత్వ ధర ఎకరాకు కేవలం రూ.4.50 లక్షలు మాత్రమే ఉంది. త్రిబుల్ ఆర్ కోసం తీసుకునే భూములకు మూడింతలు ధర ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఎకరాకు రూ. 15 లక్షలకు మించి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వేసిన కమిటీతో అయినా తమకు న్యాయం జరుగుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.



భూములు ఇవ్వబోమని గిర్మాపూర్, పెద్దాపూర్ రైతుల నినాదాలు

### త్రిబుల్ ఆర్‌కు సహకరించండి: అడిషనల్ కలెక్టర్

**రింగ్‌రోడ్డుతో అవసరం లేదన్న రైతులు**

కొండాపూర్, ఆగస్టు 20: త్రిబుల్‌ఆర్‌కు సహకరించి, రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని మెదక్ అడిషనల్ కలెక్టర్ మాధురి కోరారు. త్రిబుల్ ఆర్ కోసం భూసేకరణ చేయనున్న గిర్మాపూర్ గ్రామ శివారులను ఆర్డీవో వసంతకుమారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమకు త్రిబుల్ ఆర్ వల్ల ఉపయోగం లేదని, భూమిని నమ్ముకుని బతుకుతున్నామని, రైతుల పొట్టగొట్టి పట్టాభూములు లాక్కోవడం సరైంది కాదన్నారు. మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదంటూ గిర్మాపూర్, పెద్దాపూర్ గ్రామాల రైతులు తీర్మానించారు.

## రుణమాఫీ కోసం 'రణం'

అర్హులమైనా తమకు రుణమాఫీ కాలేదని పలువురు రైతులు అధికారుల వద్ద బారులు దీరుతున్నారు. అధికారుల తప్పుల వల్లే ప్రభుత్వం తమకు అందించిన లబ్ధిని పొందలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

7లో



కల్హేర్ వ్యవసాయ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న రైతులు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జీహెచ్‌ఎంసీ పరిధిలోని రామచంద్రాపురం కార్పొరేటర్ బి. పుష్పానగేష్ మంగళవారం రాఖీ కట్టారు. సోదరభావానికి ప్రతీక అయిన రాఖీ సందర్భంగా సీఎంకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.
- రామచంద్రాపురం

## బాబోయ్.. కుక్కలు

**▸ మాసాయిపేటలో స్వైరవిహారం ▸ పలువురిపై దాడి..**

**▸ శునకాన్ని కొట్టి చంపిన గ్రామస్థులు**

మాసాయిపేట, ఆగస్టు 20: మాసాయిపేటలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మంగళవారం గ్రామంలోని రేపల్లె మనోజ్‌కుమార్ అనే బాలుడితో పాటు మరొకరిని కరిచాయి. దీంతో ఆ శునకాన్ని గ్రామస్థులు, బాధితుల బంధువుల కొట్టి చంపేశారు. పిచ్చి కుక్క కావడంతో ఎవరిని పడితే వారిని కరుస్తున్నదని, వారం రోజులుగా రేపల్లె సురేష్, రేపల్లె యాదయ్య, రేపల్లె నర్సింలులతో పాటు పది మందిని కరిచినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో గుంపులు, గుంపులుగా తిరుగుతు చిన్నారులు, విద్యార్థులపై దాడులు చేస్తున్నాయన్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శికి గతంలోనే ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే, కుక్కల బెడద విషయమై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చానని గ్రామ కార్యదర్శి బి. రాణమ్మ తెలిపారు.






కందిలో మూలకు పడిన చెత్త సేకరణ వాహనాలు

7లో

## అటకెక్కిన తడి, పొడి చెత్త సేకరణ

### ఇక మొబైల్ హెచ్‌ఐవీ స్ర్కీనింగ్



**▸ జిల్లాకు వాహనం మంజూరు**

**▸ త్వరలో జిల్లా వ్యాప్తంగా క్యాంపులు**

**▸ రోగ నిర్ధారణ, తక్షణమే చికిత్స**

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20: సంగారెడ్డి జిల్లాకు మొబైల్ హెచ్‌ఐవీ స్ర్కీనింగ్ వాహనం మంజూరైంది. ఈ వాహనం ద్వారా హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా విరివిగా క్యాంపులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(న్యాకో), తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ మొబైల్ హెచ్‌ఐవీ స్ర్కీనింగ్ వాహనం పనిచేయనున్నది. వాహనంలో ల్యాబ్ టెక్నీషియన్, కౌన్సిలర్, డ్రైవర్ ఉంటారు. ముందస్తు క్యాంపుల షెడ్యూల్ ప్రకారం ఈ వాహనం పనిచేయనున్నది. హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్ష చేయగానే ఒక వేళ పాజిటివ్ వస్తే జిల్లా కేంద్రంలోని ఏఆర్‌టీ కేంద్రానికి సదరు వ్యక్తిని వెళ్లాలని సూచిస్తారు. చికిత్స ప్రారంభంలో భాగంగా అక్కడ ఉచితంగా అందించే ఏఆర్‌టీ మందులు వాడాలని సూచిస్తారు. జిల్లాలో సెప్టెంబరు 1 వ తేదీ నుంచి మొబైల్ హెచ్‌ఐవీ స్ర్కీనింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డానియల్ తెలిపారు.

# విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట

**▸ యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణ అత్యవసరం**

**▸ అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం**

**▸ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం**

**▸ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి**

**▸ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

జహీరాబాద్, ఆగస్టు 20: రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పట్టణంలోని ఎన్ కన్వెన్షన్‌లో జరిగిన సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అభినందన సభలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాట్లాడుత ప్రజల కనీస అవసరాలు తీర్చే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణ అత్యవసరమన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నిమ్జ్ రైతులకు అన్యాయం జరుగకుండ చూస్తామన్నారు. అర్హులైన ప్రతిరైతుకు రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు ఆయన వివరించారు. జహీరాబాద్ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ త్వరలో పూర్తిచేస్తామన్నారు. జహీరాబాద్ మున్సిపాలిటీ ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో రూ. 200 కోట్లతో 500 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాకో మొబైల్ క్యాన్సర్ స్ర్కీనింగ్ వాహనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తాను చాటాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

**ఏడాదిలో మరిన్ని పరిశ్రమలు : ఎంపీ సురేష్ షెట్కార్**

జహీరాబాద్ ప్రాంతంలో ఏర్పాటయ్యే నిమ్జ్‌లో ఏడాదిలోనే మరిన్ని పరిశ్రమలు రావడానికి సిద్ధంగా ఉన్నాయని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ తెలిపారు. జహీరాబాద్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చొరవచూపాలని మంత్రి దామోదర దృష్టికి తీసుకుపోయారు. గత ప్రభుత్వం పదేళ్లలో దోచుకుని దాచుకుందని, తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసిందని టీజీఐడీసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సెట్విన్ వ్యవస్థ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. ఖేడ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి మంత్రిని కోరారు.

జహీరాబాద్ ప్రాంతానికి ప్రత్యేకంగా 15 సెట్విన్ బస్సులను నడిపించాలని మాజీ మంత్రి డా. చంద్రశేఖర్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్దం ఉజ్వల్‌రెడ్డి, ఆయా మండల పార్టీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని సుభాష్‌గంజ్ నుంచి పస్తాపూర్ వరకు ర్యాలీ నిర్వహించారు.



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

# హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి





ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, మనోహరాబాద్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఎంజే పాఠశాల విద్యార్థులు

కంది, ఆగస్టు 20: కోల్‌కత్తాలోని మెడికల్ కళాశాలలో ట్రైనీ వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ మంగళవారం సాయత్రం అన్ని యూనియన్లకు సంబంధించిన ఉద్యోగులు దోషులను శిక్షించాలని ఫ్యాక్టరీని ఫౌండరీ గేట్ నుంచి షాపింగ్ కాంప్లెక్స్ వరకు నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఓఎఫ్ఎంకే, ఏబీడీఈఎఫ్, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### కోల్‌కత్తా ఘటన నిందితుడిని శిక్షించాలి

మనోహరాబాద్, ఆగస్టు 20: కోల్‌కత్తా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని మనోహరాబాద్ మండల కేంద్రంలోని జేఎంజే ప్రైవేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోహరాబాద్ దుర్గావాహిని మహిళా విభాగం ఆధ్వర్యంలో పాఠశాల నుంచి మనోహరాబాద్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మనోహరాబాద్ దుర్గావాహిని సభ్యులు మాట్లాడుతూ వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు చేయాలన్నారు. ఈ ర్యాలీలో దుర్గావాహిని బాధ్యులు ర్యాకల నిత్య, చెలిమెల వైష్ణవి, కుమ్మరి మౌనిక, కృతిక, బజరంగ్‌దళ్ సభ్యులు యువకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

● గొంగ్లూరు గిరిజన తండాలో ఘటన



రమావత్ జగ్యా (ఫైల్)

పుల్‌కల్, ఆగస్టు 20: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పుల్కల్ మండలం గొంగ్లూర్ గిరిజనతండాకు చెందిన రమావత్ జగ్యా(43) రాఖీ పండుగ సందర్భంగా అదే గిరిజన తండాలో ఉన్న అత్తగారి ఇంటికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలతో వెళ్లాడు. రాత్రివరకు అత్తగారి ఇంట్లోనే గడిపిన జగ్యా భోజనం చేశాక రాత్రి 11 గంటలకు ఒంటరిగా ఇంటికి వచ్చి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల వల్లనే జగ్యా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● రెండుకు చేరిన రోడ్డు ప్రమాద మృతులు

కల్హేర్, ఆగస్టు 20: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌కుమార్(38) అనే వ్యక్తి మంగళవారం మృతిచెందినట్లు కల్హేర్ ఏఎస్ఐ అంజయ్య తెలిపారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్.. తన స్నేహితులు బొడియాల విలాస్, సాయిలుతో కలిసి ఈ నెల 15న నారాయణఖేడ్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధి మునిగేపల్లి శివారులోని నారాయణఖేడ్-నిజాంపేట రహదారిపై ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో పెద్దశంకరంపేటకు చెందిన బొడియాల విలాస్(35) అక్కడిక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌కుమార్, సాయిలు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ప్రవీణ్‌కుమార్ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. దీంతో రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య రెండుకు చేరింది. మరో వ్యక్తి సాయిలు కోలుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రవీణ్‌కుమార్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిపించినట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

## జీవితంపై విరక్తితో బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడి ఆత్మహత్య



పడమటి సాయిలు(ఫైల్)

కల్హేర్, ఆగస్టు 20: జీవితంపై విరక్తితో బీజేపీ ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్హేర్ మండలం మాసాన్‌పల్లికి చెందిన పడమటి సాయిలు(39) బీజేపీ ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడిగా.. ఇంతకుముందు బీజేపీ మండలాధ్యక్షుడిగా పనిచేశారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పాటు సంతానం కలగకపోవడంతో మదనపడేవారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై మండల పరిధి మహదేవ్ శివారులోని వ్యవసాయ భూమిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే సాయిలు మృతదేహం పాక్షికంగా కుళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. రెండురోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





డంపింగ్‌యార్డుకు బదులు కంది శివారులోని అసైన్డ్ భూమిలో పారబోస్తున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, నిరుపయోగంగా డంపింగ్‌యార్డు

# అటకెక్కిన తడి, పొడి చెత్త సేకరణ



విషజ్వరాలు, సీజనల్ వ్యాధులతో మంగళవారం కంది పీహెచ్‌సీలో కిక్కిరిసిన ప్రజలు

కంది, ఆగస్టు 20: సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన కంది గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ అటకెక్కింది. చెత్త సేకరణ రిక్షాలను మూలనపడేశారు. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుల్లో వేరుచేసి ఎరువులు తయారు చేయాలని గతంలో చెప్పిన అధికారుల మాటలు నీటి మూటలయ్యాయి. పంచాయతీ ట్రాక్టర్‌తో సేకరించిన చెత్తను తీసుకెళ్లి గ్రామ శివారులోని అసైన్డ్‌భూమిలో ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. అంతేగాక కందిలోని హోటళ్లు, దాబాల్లో మిగిలిన ఆహార వ్యర్థాలను డంపింగ్‌యార్డు పక్కనే పారబోస్తున్నా.. పంచాయతీ అధికారులకు నిమ్మకు నీరెత్తడం లేదు. సీజనల్ వ్యాధులపై ఉన్నతాధికారులు గంటల తరబడి సమావేశాలు పెట్టి పంచాయతీ అధికారులను ఆదేశిస్తున్నా.. వీరు మాత్రం ప్రజల ఆరోగ్యం విషయంలో ఎలాంటి శ్రద్ధ చూపటం లేదని స్పష్టమవుతున్నది. మరోపక్క పరిశుభ్రత విషయంలో ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని తెలుస్తున్నది. ఇందుకు కారణం ఉన్నతాధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడమే అని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మంగళవారం కంది పీహెచ్‌సీ విషజ్వరాలు సీజనల్ వ్యాధులతో కిక్కిరిసిపోయారు.

### ఆరు బయటనే వ్యర్థాల పారబోత

కందిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పక్కన ఉన్న డంపింగ్‌యార్డు ఉన్నది. అయితే దాంట్లో కాకుండా పక్కన ఆరు బయటనే ప్లాస్టిక్ డబ్బాలు, డ్రమ్ముల్లో తీసుకొచ్చి ఆహార వ్యర్థాలను పారబోస్తున్నారు. ఆహార వ్యర్థాలు ఎక్కువగా ఉంటే ఆ పక్కనే మట్టితో కప్పెట్టేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా భరించలేని దుర్గంధం వెదజల్లుతున్నది. ఆహార వ్యర్థాలు ఉంచిన డబ్బాలపైన ఎలాంటి మూతలు లేకపోవడం, కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న పేదలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

## అసైన్డ్‌భూమిలో చెత్త డంపింగ్

- అంటురోగాలకు అడ్డాగా మారిన వైనం
- ఆస్పత్రుల చుట్టూ పరుగులు
- అలంకారప్రాయంగా డంపింగ్‌యార్డులు
- విజృంభిస్తున్న దోమలు, క్రిమి, కీటకాలు

### అసైన్డ్‌భూమిలో చెత్త

కంది గ్రామంలో సేకరించిన చెత్తను ఇప్పటికీ కంది శివారులోని అసైన్డ్ భూమిలో పారబోస్తున్నారు. ఆ చెత్తంతా ప్లాస్టిక్ కవర్లతో నిండి ఓ గుట్టలాగా కనిపిస్తున్నది. ఇలా పెద్ద కుప్పలాగా అయిన చెత్తను నెలరోజులకు ఒకసారి తగలబెడుతున్నారు. అసైన్డ్ భూమి పక్కనే, రిజిస్ట్రేషన్ కార్యాలయం, మైనార్టీ గురుకుల పాఠశాల కూడా ఉన్నది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, చెత్తను ఇక్కడ పారబోయొద్దని ఉపాధ్యాయులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం శూన్యం.

### నిరుపయోగంగా డంపింగ్‌యార్డు

నాలుగేళ్ల క్రితం దాదాపు రూ.రెండున్నర లక్షలతో నిర్మించిన డంపింగ్‌యార్డు ఇప్పుడు నిరుపయోగంగా మారింది. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తతో ఎరువులు తయారు చేయాలని ఆదేశించిన ఉన్నతాధికారుల మాటలు ఆచరణలో అమలుకావడం లేదు. ఇప్పటివరకు ఒక్కరోజు కూడా చెత్తను ఉపయోగించి ఎరువును తయారు చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. ఇప్పుడు డంపింగ్‌యార్డు చుట్టూ చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండి వీధి కుక్కలకు అడ్డాగా మారింది.

**సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం..**

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది కొరత, ఇతరత్రా సమస్యలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు రోజువారీగా వివరాలను ఉన్నతాధికారులకు చెబుతున్నాం. ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యమందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అత్యవసర మనిపిస్తేనే హైదరాబాద్, బీదర్ తదితర ప్రాంతాలకు తరలించాల్సి వస్తుంది. ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన సేవలందించేలా కృషి చేస్తున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ శ్రీధర్, ఆస్పత్రి సూపరింటెండెంట్



కందిలో డంపింగ్‌యార్డు పక్కనే మంగళవారం ఆహార వ్యర్థాలను పారబోసి కప్పివేస్తున్న దృశ్యం





కందిలో మూలకు పడ్డ చెత్త సేకరణ రిక్షాలు

## తాళం వేసిన ఇంట్లో చోరీ

- 15 తులాల బంగారం, రూ.80 వేల నగదు అపహరణ
- క్లూస్ టీంతో ఆధారాలు సేకరణ



ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులను పరిశీలిస్తున్న క్లూస్‌టీం

హత్నూర, ఆగస్టు 20: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి నగలు, నగదు అపహరించుకుపోయిన సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తహేర్ఖాన్‌పేట గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంజరి ఆంజనేయులు, లావణ్య దంపతులు పిల్లలతో కలిసి సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి రాఖీ కట్టడానికి బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగిరావడంతో ఇంటి ప్రధాన తలుపుల తాళం పగులగొట్టి ఉండడంతో ఆందోళన గురయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో అల్మారా తలుపులు తెరిచి ఉండడంతో పాటు చీరలు, నగలకు సంబంధించిన డబ్బాలు చిందరవందరగా పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారమందించారు. 15 తులాల బంగారు నగలతో పాటు రూ.80 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు. ఎస్‌ఐ సుభాష్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంగారెడ్డి నుంచి చిట్టిబాబు ఆధ్వర్యంలో క్లూస్‌టీంను రప్పించి పలు ఆధారాలు సేకరించారు. బాధితుడు వంజరి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

## గంగమ్మ ఆలయంలో చోరీ

- వెండి కిరీటం, ముక్కుపుడుక, వెండి కళ్లు, బంగారు బొట్టు బిళ్ల అపహరణ



వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్‌ఐ మురళీధర్‌గౌడ్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 20: గుర్తుతెలిన దుండగులు గంగమ్మ గుడి తాళం పగులగొట్టి అమ్మవారి నగలు అపహరించుకుపోయిన సంఘటన సోమవారం రాత్రి నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో చోటుచేసుకుంది. చిన్నకోడూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే గంగపుత్ర సంఘం వాళ్లు ఉదయం గుడికి వెళ్లగా.. గర్భగుడి తాళాలు పగులగొట్టి ఉండి, అమ్మవారి కిరీటం కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారమందించారు. సంఘటనా స్థలానికి చిన్నకోడూరు ఏఎస్‌ఐ మురళీధర్‌గౌడ్ వెళ్లి పరిశీలించారు. గంగమ్మ ఆలయంలో 1.14 కిలోల వెండి కిరీటం, బంగారు ముక్కుపుడక, వెండి కళ్లు, బంగారు బొట్టు బిల్లను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. గంగపుత్ర సంఘం ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



స్వామి(ఫైల్)

రాయపోల్, ఆగస్టు 20: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగి చనిపోయాడు. ఎస్‌ఐ రఘుపతి వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం వీరానగర్ గ్రామానికి చెందిన నిమ్మరాజు స్వామి(40) మంగళవారం ఉదయం స్థానిక తుమ్మకుంట చెరువులో చేపలు పట్టడానికి వల తీసుకొని వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ఆయన కాళ్లకు వల చుట్టుకుంది. నీటిలో మునిగిపోతున్న సమయంలో కేకలు వేశాడు. ఈ కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి స్వామిని రక్షించేందుకు చెరువులోకి వెళ్లేసరికి నీటిలో మునిగిపోయాడు. చాలాసేపు చెరువులో గాలించగా స్వామి మృతదేహం లభించింది. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు వివాహమైంది. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రసాయన వ్యర్థ జలాలు తాగి రెండు పాడిగేదెలు మృతి

- అపస్మారకస్థితిలో మరో ఐదు పాడిగేదెలు



అయ్యమ్మ చెరువుకట్టపై మృతిచెందిన గేదె వద్ద ఆందోళన చేస్తున్న కిష్టాయ్యపల్లి వాసులు

జిన్నారం, ఆగస్టు 20: రసాయన వ్యర్థ జలాలు తాగి రెండు పాడిగేదెలు మృతిచెందగా.. మరో ఐదు అపస్మారక స్థితిలోకి వెళ్లాయి. ఈ సంఘటన కిష్టాయపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు పరిశ్రమ బస్సులను అడ్డుకుని మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన బసెట్టిగారి సాయికుమార్ అనే రైతుకు పాడి గేదెలు గ్రామ శివారులో మేతకు వెళ్లి కాలుష్య జలాలు తాగి మృతిచెందాయి. అతడికి చెందిన మరో ఐదు గేదెలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. దీంతో మాజీ సర్పంచ్ నీరుడి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బసెట్టిగారి రాజు, నాయకులు వెంటేష్, శంకర్ బాధిత రైతుతో కలిసి పారిశ్రామికవాడకు వెళ్లే అయ్యమ్మ చెరువుపై పాడి గేదెలతో ఆందోళనకు దిగారు. పరిశ్రమలకు వెళ్లే బస్సులు, వాహనాలు అడ్డుకొని, రసాయన జలాల తీరుపై మండిపడ్డారు. తరచూ కాలుష్య జలాల తాగి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని, బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు. కాలుష్య జలాల విడుదలకు కారకులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానికుల ఆందోళనతో గంటపాటు పారిశ్రామిక వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి.

## రైల్వే బ్రిడ్జి కోసం భూసేకరణపై మిట్టపల్లిలో గ్రామసభ

- భూమి ఇచ్చేది లేదన్న బాధితులు
- అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన



మిట్టపల్లిలో గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 20: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి పరిసర ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి కోసం మంగళవారం గ్రామపంచాయతీ వద్ద భూసేకరణపై గ్రామ సభను నిర్వహించారు. భూసేకరణ విషయమై గతంలోనే ఒక లిస్టును తయారుచేసి బాధితులకు ఇచ్చామని, దానిపై ఏమైనా సవరణలు ఉంటే చేసుకోవాలని గ్రామసభకు హాజరైన అధికారులు గ్రామస్థులకు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సవరణల విషయం పక్కనపెడితే అసలు భూసేకరణకు తాము ఒప్పుకోమని, నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా బ్రిడ్జిని నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్నారు. భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చే సమయంలో 60 రోజుల్లో అభ్యంతరాలు ఉంటే తెలుపాలని చెప్పారని, కానీ తాము అభ్యంతరాలు చెప్పినా ఏ అధికారి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరం మేరకే బ్రిడ్జిని నిర్మించాలని గతంలో ఎన్నో ఉద్యమాలు, ఆందోళన చేసినప్పటికీ తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అందరికీ ఇబ్బంది లేకుండా బ్రిడ్జి నిర్మించాలని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం ఆపడానికి ఎటువంటి అధికారం లేదని, పనులు కొనసాగుతాయని భూసేకరణ విషయంలో ఎక్కువ, తక్కువ సవరణ విషయంలో అభ్యంతరాలు మాత్రమే తెలుపాలని సూచించి అధికారులు వెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

## నా చివరి రక్తపు బొట్టు వరకూ మీతోనే..

- ఎంపీ రఘునందన్
- దురహంకారంతోనే కేసీఆర్ ఓడారు
- రైతులతో ఆటలాడితే రేవంత్‌కూ అదే గతి



కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్

రామాయంపేట, ఆగస్టు 20: 'నా చివరి రక్తపు బొట్టు వరకూ మీకోసం శ్రమిస్తా.. మీరు లేనిదే మొన్నటి ఎన్నికలో నేను గెలవలేను.. పార్టీ కార్యకర్తలే నన్ను ఆదరించారు' అని మెదక్ ఎంపీ రఘునందన్ అన్నారు. మంగళవారం రామాయంపేట, నిజాంపేట మండలాలకు సంబంధించిన ఓటర్లకు కృతజ్ఞత సభ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే సత్తా చూపాలన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా శ్రమించిన మీరు సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ఎక్కువ శాతం ప్రజాప్రతినిధులుగా గెలవాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. మరో రెండు, మూడు మాసాల్లో ఎన్నికల నగారా మోగనుందని, ఇందుకు మనమంతా సమాయత్తం కావాల్సి ఉందన్నారు. కాగా గత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ దురంహకారాన్ని ప్రజలు ఓడించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పేర మోసం చేస్తోందన్నారు. అంతేగాక మంత్రులకు పరిపాలనా విధానంపై ఎలాంటి అవగాహన లేకుండాపోతోందని చెప్పారు. పాలన ఇలాగే కొనసాగితే కేసీఆర్‌కు పట్టిన గతే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తప్పదని రఘునందన్ ఘాటుగా హెచ్చరించారు. రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటలో మరో రెండు రైళ్లను నిలిపేందుకు కేంద్రమంత్రికి లేఖ ఇస్తానన్నారు.

### మరో బైపాస్ ఏర్పాటుపై హైవే అధికారులతో సమీక్ష

ఇప్పటికే ఒక బైపాస్ నిర్మించారు. ఇప్పుడు సంగారెడ్డి-ఎల్కతుర్తి జాతీయ రహదారి విస్తరణలో మరో బైపాస్ ఏర్పాటుపై ఎంపీ హైవే అథారిటీ అధికారులతో సమీక్షించారు. బైపాస్ లేకుండా రూటు వెడల్పుపై ఆలోచించి, నిర్ణయం తీసుకోవాలని తన అభిప్రాయాన్ని అధికారుల ముందుంచారు. ఇదివరకే బైపాస్‌తో విలువైన భూములు కోల్పోయి, వ్యాపార రంగానికి నష్టం జరిగింది. ఈసారి అలాకాకుండా ఉన్న రహదారినే మరింత వెడల్పు చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ విషయంపై మరోమారు చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటే రామాయంపేట పురోభివృద్ధిలో అధిగమిస్తుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేపీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్, రాగి రాములు, వేల్పుల సిద్ధిరాములు, నిజాంపేట అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కుమార్తెకు యాక్సిడెంట్ అయ్యిందంటూ బురిడీ

- రూ.30వేలు పోగొట్టుకున్న మహిళా ఉద్యోగి

చేర్యాల, ఆగస్టు 20: 'మీ కూతురుకు యాక్సిడెంట్ అయ్యింది. వెంటనే రూ.50 వేలు పంపించండి.' అంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళా ఉద్యోగికి కాల్ చేసి బురిడీ కొట్టించడంతో రూ.30వేలు పోగొట్టుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని ట్రాన్స్‌కో ఈఆర్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగికి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌కాల్ చేసి తాము పోలీసులమని హిందీ భాషలో మాట్లాడారు. ఆమె కూతురు పేరు చెప్పి రోడ్డు ప్రమాదానికి గురైందని, వెంటనే డబ్బులు పంపించా లని మాయమాటలతో నమ్మబలికించడంతో రూ.30 వేలు ఫోన్‌పే ద్వారా పంపించింది. మరో రూ.20వేలు పంపించాలని ఒత్తిడి చేయడంతో అనుమానం రావడంతో కాల్ కట్‌చేసి పోలీసులను ఆశ్రయించడంతో దర్యాప్తు చేపట్టారు.

## నేషనల్ హైవేల వెంట మియావాకీ ప్లాంటేషన్

- 53 ఎకరాల్లో నాటేందుకు ఏర్పాట్లు
- ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాస్‌రావు



తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద మొక్క నాటుతున్న పీడీ, జీఎంఆర్ ప్రతినిధులు

తూప్రాన్, ఆగస్టు 20: జాతీయ రహదారులను ఆనుకుని 53 ఎకరాల ల్యాండ్ పార్సిల్‌లో మియావాకీ ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఆయన మొక్కనాటారు. అనంతరం మియావాకీ ప్లాంటేషన్, మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమ బ్యానర్‌ను ఆవిష్కరించారు. జాతీయ రహదారులను గ్రీన్ కవర్‌తో నింపేందుకు ఎన్‌హెచ్ఏఐ వివిధ ప్రదేశాలలో మియావాకీ ప్లాంటేషన్‌ను నాటేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. జాతీయ రహదారులను గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేస్‌గా మార్చడమే లక్ష్యమన్నారు. జీఎంఆర్ హైవేస్ హెడ్ శంకర్ గణేశన్, ఎంఎస్‌వీ ఇంజనీర్ హజ్రాత్‌రెడ్డి, జీఎంఆర్ హైవేస్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ, వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, హైవేస్ ప్రతినిధులు, రక్ష సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య మిత్రల సమ్మె షురూ



సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఆరోగ్య మిత్రలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల సమ్మె బాటపట్టారు. తొలిరోజు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 43 మంది ఆరోగ్యమిత్రలు ఇదేవిధంగా నల్లబ్యాడ్జీలు ధరించి ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌లో కూర్చొని విధుల్లో పాల్గొన్నారు. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి చొరవ తీసుకోకపోవడంతో వారంతా సమ్మెబాట పట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆరోగ్యమిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు హిమగిరి ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద 16 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, విధి నిర్వహణలో మరణిస్తే రూ.50 లక్షల ఆర్థిక సాయం చేయాలని, అంతేకాకుండా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులివ్వాలని, ఆరోగ్యమిత్రలను డీపీవో క్యాడర్ కల్పించాలని, జీవో 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని, షఫ్లింగ్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## రుణమాఫీ కోసం 'రణం'

- బ్యాంకుల వద్ద రైతుల పడిగాపులు
- జాబితాలో పేరు లేకపోవడంతో ఆందోళనలు



బెజ్జంకి మండలం తోటపల్లి ఇండియన్ బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

బెజ్జంకి, ఆగస్టు 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకంలో అర్హులైన తమకు రుణమాఫీ కాలేదని రైతులు బ్యాంకు ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులను నిలదీశారు. బెజ్జంకి మండలంలోని తోటపల్లి ఇండియన్ బ్యాంకు పరిధిలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు పంట రుణం తీసుకున్నారు. సంబంధిత బ్యాంకు పరిధిలో సగానికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు.. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్లనే తమకు రుణమాఫీ కాలేదని నిలదీశారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది మూలంగానే తాము నష్టపోయామని ఆరోపిస్తూ బ్యాంకు షెటర్‌ను మూసివేశారు. సిద్దిపేట జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. అర్హత ఉండి రుణమాఫీ కాని రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మాఫీ అయ్యేలా చూస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అలాగే మండల కేంద్రంలోని రైతువేదికలో పంట సాగు మెళకువల పట్ల శాస్త్రవేత్తలతో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మహేష్ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల రైతులు రైతువేదిక వద్దకు చేరుకుని, తమకు రుణమాఫీ కాలేదని నిలదీశారు. మండలంలోని సంబంధిత బ్యాంకుల్లో రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

### బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయం వద్ద బారులు

చేర్యాల, ఆగస్టు 20: ప్రభుత్వం దఫాలవారీ పంట రుణమాఫీ అమలుచేసిన క్రమంలో చేర్యాల, కొమురవెల్లి, ధూళిమిట్ట, మద్దూరు, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాల రైతులు తమ వివరాలు తెలుసుకోవడంతో పాటు లోన్ రెన్యూవల్ చేసుకునేందుకు చేర్యాల పట్టణంలోని పలు బ్యాంకులకు పరుగెత్తుతున్నారు. దీంతో ఆయా బ్యాంకులు రైతులతో కిటకిటలాడుతున్నాయి. మంగళవారం చేర్యాల పట్టణంలోని ఎస్‌బీఐ, ఏడీబీ బ్రాంచ్‌కి రైతులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మేనేజర్ శ్రీలత రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా బ్యాంకు ఆవరణలో టెంట్ వేయించి కుర్చీలు ఏర్పాటుచేశారు. తాగునీటి వసతి కల్పించడంతో ఓపికగా ఉండి అలసట తీర్చడంతో ఆమెను అభినందించారు. సాంకేతిక కారణాల వల్ల రూ.1 నుంచి రూ.2 లక్షల వరకు రుణమాఫీ కాని వారు గ్రీవెన్స్ దరఖాస్తులు అందించేందుకు వ్యవసాయాధికారి కార్యాలయానికి తరలివచ్చారు.





చేర్యాల ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయం నుంచి ఆవరణ వరకు బారులుతీరిన రైతులు

### కల్హేర్‌లోనూ ఆందోళన

కల్హేర్, ఆగస్టు 20: రుణమాఫీ కోసం విధించిన నిబంధన ప్రక్రియ సజావుగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుణాలు చెల్లించి, సకాలంలో రెన్యూవల్ చేయించిన రైతులకు సంబంధించి రుణమాఫీ జాబితాలో పేరు లేకపోవడంతో మంగళవారం కల్హేర్ వ్యవసాయ కార్యాలయానికి చేరుకుని ఆందోళన పట్టారు. వివిధ సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తింపజేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ సిబ్బందిని ఆశ్రయించి దరఖాస్తులు చేసుకుంటున్నారు.

### రైతులు ఆందోళన చెందవద్దు: ఏడీఏ

రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతులు ఆందోళన చెందవద్దని నారాయణఖేడ్ వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్ కుమార్ అన్నారు. మంగళవారం కల్హేర్‌లోని రైతువేదికలో రైతులతో మాట్లాడి వారి సందేహాలకు సమాధానమిచ్చి, రుణమాఫీ జరగని రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వారితో మాట్లాడుతూ రైతులకు సాంకేతిక కారణాలతోనే రుణమాఫీ కాలేదని, ఆందోళన చెందవద్దన్నారు. వారంరోజుల్లో అందరికీ రుణమాఫీ రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సంతోష కుమారి, క్రిష్ణవేణి పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో మొక్క నాటుతున్నతెలంగాణ రీజినల్అధికారులు

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

● ఎన్‌హెచ్ఏఐ హైదరాబాద్ తెలంగాణ రీజినల్ అధికారి

పెద్దశంకరంపేట,ఆగస్టు 20: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరముందని ఎన్‌హెచ్ఏఐ తెలంగాణ హైదరాబాద్ రీజినల్ అధికారి షేక్‌రజాక్ పేర్కొన్నారు. మంగళవారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్ జమ్మికుంట వద్ద 'ఏక్ పెడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పీడీ మధుసూదన్‌రావు, గజ్వేల్ జాయింట్ అడ్మిన్ రాజారావు, మహమ్మద్ రెహమాన్, రవిశంకర్, క్యూబ్ హైవేస్ రీజినల్ హెడ్ వసుంధర, శంకరంపేట ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ హెడ్ ప్రభాకర్‌రెడ్డి, ఐఎంఎస్ మేనేజర్ కాజా మైనోద్దీన్, నిజాంపేట జిల్లాపరిషత్ విద్యార్థులు, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు శంకరంపేట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో రక్షాబంధన్ వేడుకలు



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డికి రాఖీ కడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 20: సంగారెడ్డి జిల్లా కోర్టులో మంగళవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డికి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర రాఖీ కట్టారు. అనంతరం మహిళా న్యాయవాదులంతా ఇతర న్యాయవాదులందరికీ రాఖీలు కట్టారు. అనంతరం పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు అంబరీష్, నూర్‌రెడ్డి, జ్ఞానేబా, రమేష్, ఆంజనేయులు, పెంటయ్య, వినోద్, విజయ్, మాధవి, మంజుల, అరుణ, లలిత, సుధాకర్, చంద్రకాంత్, మధుమోహన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌వోబీ పనులకు మోక్షమెన్నడో?

● జహీరాబాద్‌లో రూ.90 కోట్లతో పనులు ● పెండింగ్‌లో రూ.15 కోట్ల బిల్లులు ● ఐదారేళ్లుగా ఆగుతూ.. సాగుతున్న పనులు

జహీరాబాద్, ఆగస్టు 20: జహీరాబాద్ పట్టణంలో రూ.90కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జిపనులు నత్తనడకన సాగుతున్నాయి. ఐదారేళ్లుగా బ్రిడ్జిపనులు ఆగుతూ.. సాగుతున్నాయి. పనులను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తెస్తారని ఆశించిన పట్టణ ప్రజలు, ప్రయాణికులకు కొన్నేళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు, నాయకులకు విన్నవించినా ప్రయోజనం కరువైందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా బ్రిడ్జికి సంబంధించి సుమారు రూ.15కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, సదరు కాంట్రాక్టర్ అధికారులతో పాటు నాయకులకు విన్నవించినా పట్టించుకోక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. కొంతైనా బిల్లులను ఇస్తే పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తెస్తానని కాంట్రాక్టర్ స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగ రైల్వేగేటు పడిన సందర్భాల్లో రైలు వెళ్లిపోయే వరకు సుమారు 25 నిమిషాలపాటు నిరీక్షణ తప్పడం లేదు. మరికొన్ని సందర్భాల్లో మరింత అదనపు సమయం కూడా పడుతుందన్నారు. అలాగే బ్రిడ్జి పక్క నుంచి వేసిన అప్రోచ్‌రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



జహీరాబాద్ పట్టణంలో నిధులు విడుదల కాకపోవడంతో నిలిచిపోయిన రైల్వే ఓవర్‌బ్రిడ్జి

## నాలాలకు అడ్డంగా అక్రమ నిర్మాణాలుంటే కూల్చేస్తాం



జహీరాబాద్‌లో నాలాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

జహీరాబాద్, ఆగస్టు 20: జహీరాబాద్ పట్టణపరిధిలో నాలాలకు అడ్డంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులుగా పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షపునీరు, మురుగునీరు రోడ్లపై పేరుకు పోకుండా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు మురుగుకాలువల్లో చెత్తనుతొలగిస్తున్నారన్నారు. ఈ క్రమంలో మురుగు కాలువలకు, ప్రధాన కాలువలకు అడ్డంగా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిరోజూ సిబ్బందితో కలిసి తాము పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇంద్రప్రస్థాన్ సమీపంలో ప్రధానకాలువతో పాటు, పట్టణంలోని పలు ప్రధాన కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వరదనీరు ముందుకు వెళ్లేలా చూస్తున్నామన్నారు. చెత్తను ప్రజలు ఎక్కడపడితే అక్కడ వేయకుండ చెత్త సేకరణ కోసం వచ్చే వాహనాల్లోనే వేయాలన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగ ఉంచుకోవాలన్నారు. చెత్తపరమైన పరిశుభ్రత, తదితర సమస్యలేమైన ఉంటే పట్టణ ప్రజలు తమదృష్టికి తీసుకురావాలన్నారు.ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు వెంటనే స్పందిస్తామన్నారు.



రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దక్షిణమధ్య రైల్వే యూజర్‌కమిటీ సభ్యుడు కాశీనాథ్

## రైల్వేస్టేషన్ అభివృద్ధిని వేగవంతం చేయాలి

● దక్షిణమధ్య రైల్వే యూజర్‌కమిటీ సభ్యుడు కాశీనాథ్

జహీరాబాద్, ఆగస్టు 20: అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దక్షిణమధ్య రైల్వే యూజర్‌కమిటీ సభ్యుడు కాశీనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను పరిశీలించి జరుగుతున్న అభివృద్ధి పనులపై స్టేషన్ మేనేజర్ మాధవక్రిష్ణ, తదితరులతో ఆరా తీశారు. రైల్వేస్టేషన్‌ను త్వరగా అభివృద్ధి చేసి ప్రజలకు వినియోగంలోకి తేవాలన్నారు. రైల్వేస్టేషన్‌లో అభివృద్ధిపనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రభుత్వం ప్రజల ప్రయోజనార్థం జహీరాబాద్ రైల్వేస్టేషన్‌ను రూ.25కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ, పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. నత్తనడకన జరుగుతున్న అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

## మున్సిపల్ కొత్తభవనం పనుల పరిశీలన

నర్సాపూర్, ఆగస్టు 20: నర్సాపూర్‌లో ఆగిపోయిన మున్సిపల్ కొత్త భవన నిర్మాణం పనులను మంగళవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఎస్ఈ జగదీశ్వర్ పరిశీలించారు. ఆరు కోట్లతో చేపట్టిన అధునాతన మున్సిపల్ భవన నిర్మాణం పనులను బిల్లులు రావేమోననే ఉద్దేశంతో పనులు నిలిపివేశారు. ఇదే విషయమై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా ఇన్‌చార్జి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఎస్ఈ జగదీశ్వర్ వచ్చి పూర్తయిన పనులు, పనుల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. మిగిలిపోయిన పనులను కూడా త్వరగా పూర్తయ్యేటట్టు చూడాలని డీఈఈ రాధికలక్ష్మికి సూచించారు.

## రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన



డ్రోన్‌తో మందులను స్ప్రే చేయడంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టేక్మాల్, ఆగస్టు 20: రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో కుసంగి గ్రామ రైతు వేదికలో సమావేశం నిర్వహించి రైతులకు డ్రోన్ ద్వారా రెండున్నర ఎకరాలకు ఉచితంగా మందులను పిచికారి చేస్తున్నారు. కార్యక్రమానికి ఐఐఎంఆర్ ప్రతినిధులు డాక్టర్ గంగయ్య, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ రాజేష్, సైంటిస్ట్ డాక్టర్ రఫీ, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఇంద్రయ్య, గ్రామ పెద్దలు యూసుఫ్, సంగమేశ్వర్ గౌడ్, ఆంజయ్య, మొగల్‌రెడ్డి, మల్లయ్య, ఎఫ్‌పీవో ఛైర్మన్ మొగులయ్య, సీఈవో వెంకటేశం, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## చిన్నశంకరంపేటలో భారీ వర్షం



పొంగిపొర్లుతున్న ఈరన్న వాగు

చిన్నశంకరంపేట, ఆగస్టు 20: మండలంలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. రాత్రి 8 గంటలకు మొదలైన రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మెదక్ జిల్లాలోనే చిన్నశంకరంపేట మండలంలో అత్యధికంగా 79.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జంగరాయి, చందాపూర్, గజగట్లపల్లి, టీమాందాపూర్ తదితర గ్రామాల్లో వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి చెరువులు మత్తడి దుంకుతున్నాయి, వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. జంగరాయిలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. పాత ఇళ్లలో ఉండరాదని ప్రజలకు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇళ్లు కూలిన బాధితులకు తాత్కాలిక పునరావాసం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. భారీ వర్ష ప్రభావంతో ప్రజలు అలర్ట్‌గా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## సంగారెడ్డిలో యువకుడి అదృశ్యం



బొర్ర ప్రసాద్

సంగారెడ్డి క్రైం/ఫుల్‌కల్, ఆగస్టు 20: సంగారెడ్డి పట్టణంలో ఓ యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ఎన్.భాస్కర్ తెలిపారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన బొర్ర ప్రసాద్ (20) సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న బాలాజీ క్లినిక్‌లో వార్డ్‌బాయ్‌గా పనిచేయడం కోసం ఈ నెల 18న సుల్తాన్‌పూర్ నుంచి సంగారెడ్డికి వచ్చాడు. అయితే తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో అతడి తల్లి బి.శాంతమ్మ సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కర్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లోగానీ లేదా 08455 276333, 8712656718 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఆలయంలో హుండీ చోరీకి యత్నం

కంగ్టి, ఆగస్టు 20: మండలకేంద్రంలోని సిద్దేశ్వర ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు హుండీని దొంగిలించేందుకు యత్నించారు. ఆలయ పూజారులు సోమవారం రాత్రి ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. కాగా శ్రావణ మాసంలో భక్తులు ఎక్కువగా రావడంతో హుండీలో పెద్దఎత్తున నగదు కానుకలు ఉంటాయని భావించిన దుండగులు హుండీని ధ్వంసం చేసేందుకు తీవ్రంగా యత్నించినా సాధ్యపడలేదు. హుండీ పై భాగంలో రంధ్రం చేసినా చోరీకి వీలుపడలేదు. మంగళవారం ఉదయం ఎప్పటిలాగే ఆలయానికి వచ్చిన పూజారులు ఈ విషయాన్ని గమనించారు. అయితే తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## పలు మండలాల్లో రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



నర్సాపూర్‌లో డీసీసీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సాపూర్/రామాయంపేట/మాసాయిపేట/వెల్దుర్తి, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం నర్సాపూర్‌లో ఆయన చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శేషసాయిరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లలిత, జ్యోతి, మాజీ ఎంపీటీసీ మేఘమాల, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. రామాయంపేటలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేసి రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పల్లె రామచందర్ గౌడ్, మాజీ ఎంపీపీ రమేష్ రెడ్డి, కౌన్సిలర్ దేమే యాదగిరి, భైరం కుమార్, చంద్రం ఉన్నారు. మాసాయిపేటలో రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, సిద్దిరాములు, కృష్ణారెడ్డి, భూస్వామి, గుండారం శ్రీనివాస్, జగదీష్, శ్రీకాంత్ రెడ్డి, ముక్కు దశరథ పాల్గొన్నారు. వెల్దుర్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, మల్లేశం, ఆంజనేయులు, నర్సింహరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల బదిలీలు



ఝాన్సీలక్ష్మి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20 : సంగారెడ్డి మండల వ్యవసాయాధికారిగా ఝాన్సీలక్ష్మి నియమితులయ్యారు. తాండూర్ నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏవీజీకే ప్రసాద్ రామచంద్రాపురం మండల వ్యవసాయాధికారిగా బదిలీ అయ్యారు. మంగళవారం ఏవో ఝాన్సీలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.

● నాగల్‌గిద్ద: నాగల్‌గిద్ద మండల వ్యవసాయాధికారిగా ప్రవీణ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించిన వెంకటేశం, నారాయణఖేడ్‌కు బదిలీపై వెళ్లారు.

● కల్హేర్: కల్హేర్ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ వికారాబాద్ జిల్లా మర్పల్లికి బదిలీ అయ్యారు. అలాగే బీబీపేట క్లస్టర్ ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న సతీష్‌ను ఖేడ్ మండలంలోని సంజీవన్‌రావ్‌పేటకు, బాచేపల్లి క్లస్టర్‌లో ఏఈవో భాస్కర్‌ను సిర్గాపూర్ క్లస్టర్‌కు బదిలీ చేశారు.

### బదిలీ అయినవారికి సన్మానం

వెల్దుర్తి, ఆగస్టు 20: మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను మంగళవారం వెల్దుర్తి ఎంపీడీవో ఉమాదేవి సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీవో విఘ్నేశ్వర్, ఏపీవో రాజు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేరాలు తగ్గేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలి: మెదక్ ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్నఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 20: జిల్లాలో నేరాలు తగ్గేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెల వారీ నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసే విధానం, కోడీకరించాల్సిన అంశాలపై వివరించారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి పలు సూచనలు చేస్తూ.. వారి యొక్క పనితనాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. పీస్ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసి మండపాల నిర్వాహకులతో మాట్లాడాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకట్ రెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, జిల్లా సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలి

డయల్ 100 కాల్స్ పట్ల పోలీసులు, డ్రైవర్లు అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని అన్ని సర్కిల్, సబ్‌డివిజన, స్టేషన్‌లలో పోలీసు వాహనాల తనిఖీల్లో భాగంగా వాహనాల పనితీరు, వాటి కండిషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సాయుధ దళ డీఎస్పీ రంగానాయక్, ఆర్ఐ శైలేందర్, జిల్లాలోని పోలీసు వాహనాల డ్రైవర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రుణమాఫీ జరగలేదని అధైర్యపడొద్దు

కోహీర్, ఆగస్టు 20: మూడు విడతల్లో రుణమాఫీ కానీ రైతులు అధైర్యపడవద్దని, అర్హత గల ప్రతీ రైతుకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్ రైతులకు భరోసా కల్పించారు. మంగళవారం కోహీర్‌లోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఏవో నవీన్‌కుమార్ రుణమాఫీ అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ కారణాల వల్ల రూ.2 లక్షల లోపు రుణమున్నా కూడా మాఫీ రానట్లయితే ఆ రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని తిరిగి ప్రభుత్వానికి పంపించనున్నట్టు తెలిపారు. అపోహలు పెట్టుకొని అధైర్య పడకూడదని ఏవో పేర్కొన్నారు. అనంతరం పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, ఏఈవోలు శ్రీనివాస్, వేదవతి సంధ్య, మౌనిక, సవిత, స్వాతి రైతులు తదితరులు ఉన్నారు.

● చిన్నశంకరంపేట: రుణమాఫీ కాని రైతులు అధైర్యపడొద్దని చిన్నశంకరంపేట ఏవో లక్ష్మీప్రవీణ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతులకు రుణమాఫీ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

● టేక్మాల్: మండలంలో రుణమాఫీ కానీ రైతులు టేక్మాల్ రైతు వేదికలో దరఖాస్తులు చేసుకోవాలని ఏవో రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన రైతు వేదికలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ కానీ రైతులు పట్టాదారు పాసు బుక్ లేదా బ్యాంకు స్టేట్‌మెంట్, బ్యాంక్ అకౌంట్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు అందించాలని తెలిపారు.

## రాంసానిపల్లిలో డెంగీపై కళాజాత

జోగిపేట, ఆగస్టు 20: విజృంభిస్తున్న డెంగీ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ మంగళవారం మండలంలోని రాంసానిపల్లిలో కళా ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందానికి చెందిన కళాకారులు పాటలు, నృత్యాలు, కథానికల రూపంలో డెంగీని పారదోలాలంటే పరిసరాల పరిశుభ్రతతోనే సాధ్యమని ప్రజలకు వివరించారు. వేడి చేసి చల్లార్చిన సురక్షితమైన నీటినే తాగాలని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, మల్లయ్య, బాలయ్య రాములు, కళాకారులు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పటాన్‌చెరు, ఆగస్టు 19: మండల పరిధిలోని 57మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు మంగళవారం అమీన్‌పూర్‌లో ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు సమాన వేగంగా కొనసాగిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ ఛైర్మన్ నందారం నర్సింహగౌడ్, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

నారాయణఖేడ్, ఆగస్టు 20: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతుల మేలు కోసం కృషి చేస్తున్న, తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు లేని పోని ఆరోపణలు చేస్తూ, రైతులను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సాంకేతిక కారణాలతో నిలిచి పోయిన రైతులకు రుణమాఫీ చేయనున్నట్టు తెలిపారు. అనంతరం మనూరు మండలం అతిమ్యాల్‌కు చెందిన అరుణకు, మార్డికి చెందిన అంజయ్‌కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

## ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయండి

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్, ఆగస్టు 20: రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సంఖ్యను కుదించేందుకు రుణమాఫీ మార్గదర్శకాలు చేశారని, ఆంక్షలు లేవని సీఎం చెబుతున్నా గైడ్‌లైన్స్‌ను ఎక్కడా మార్చలేదని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో రైతుభరోసా పథకానికి నిబంధనలు వర్తింపజేస్తామని ఎందుకు చెప్పలేదని చింతా ప్రభాకర్ ప్రశ్నించారు.

## తుర్కపల్లి పీహెచ్‌సీలో అదనపు కలెక్టర్ తనిఖీ



వైద్యసేవలపై రోగితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నారాయణఖేడ్, ఆగస్టు 20: మండలపరిధిలోని తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించారు. ల్యాబ్‌లో పరీక్షల నిర్వహణ, రికార్డులు, మందుల స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట ఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌వోసంధ్యారాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాగారెడ్డి ఉన్నారు.

## సూపర్ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 20: సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని ఓ సూపర్ మార్కెట్‌లో జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీశిక ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి ఉదయం పన్నీర్‌ను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లి ఓపెన్ చేయగా దుర్వాసన వచ్చింది. సదరు వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు చేశారు. పన్నీర్ తయారు చేసిన కంపెనీకి సంబంధించిన పనీర్ ప్యాకెట్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా గడువు ముగిసిన ఓ మ్యాంగో జ్యూస్ బాటిల్‌ను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీశిక మాట్లాడుతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తూప్రాన్‌లో 29 నుంచి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

● జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాల రమేష్

తూప్రాన్, ఆగస్టు 20: తూప్రాన్‌లో ఈనెల 29 నుంచి 31 వరకు స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాల రమేష్ తెలిపారు. మంగళవారం తూప్రాన్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వతి సత్యనారాయణ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. పోటీలు బాల, బాలికలకు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో క్రీడలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 29న వాలీబాల్, 30న ఖోఖో, 31న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారుల జట్ల వివరాలను ఈనెల 27లోగా స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సరోజినికి గేమ్స్ ఫీజు చెల్లించి అందజేయాలన్నారు.

## మెదక్‌లో మున్నూరు కాపుల మౌనదీక్ష

మెదక్ అర్బన్, ఆగస్టు 20: మున్నూరుకాపుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బండ నారాయణ పేర్కొన్నారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్‌కు నిధులు, కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రతీ ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలని కోరారు. రాష్ట్రంలో 24 శాతం ఉన్న మున్నూరుకాపులకు రెండు మంత్రి పదవులు కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేస్తూ.. మౌన దీక్ష చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బట్టి ఉదయ్‌కుమార్, నాయకులు మహిపాల్, కోఆర్డినేటర్ వీర్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు గట్టేష్, నాయకులు మల్లేశం, ప్రసాద్, విజయ్, రాజు, అశోక్, అనిల్, శేఖర్, యువక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు చేపట్టండి





మునిపల్లి మోడల్‌స్కూల్ వద్ద మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు

మునిపల్లి, ఆగస్టు 20: మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న టీచర్లకు 13ఏళ్లుగా బదిలీలు చేపట్టకపోవడం బాధాకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు పేర్కొన్నారు. టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మల్లికార్జున్‌పల్లి, మునిపల్లి జడ్పీ హైస్కూల్‌తో పాటు మోడల్‌స్కూల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కొన్నేళ్లుగా బదిలీలు నిర్వహించకపోవడం ఇబ్బందిగా మారిందన్నారు. అలాగే 317 ఇంప్లిమెంటేషన్ చేయడంలో జాప్యం జరుగుతున్నదన్నారు. మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21 హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ దీక్షలో మోడల్ స్కూల్ టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి డి. మునేష్, ఎంఎస్‌టీఎఫ్ నాయకులు సునీల్, మహేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల పట్ల నిరసన



జోగిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారులు, బీజేపీ నాయకులు

జోగిపేట/పెద్దశంకరంపేట/రేగోడ్, ఆగస్టు 20: బంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగుతున్న దాడులను నిరసిస్తూ... బీజేపీ, సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో మంగళవారం జోగిపేటలో బంద్ పాటించి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పలువురు వ్యాపారులు, యువకులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను ఉదయం మూసి వేశారు. అనంతరం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, ఆధ్వర్యంలో... వారంతా స్థానిక క్లాక్‌టవర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్, పోలీస్ స్టేషన్, బసవేశ్వర చౌక్ మీదుగా క్లాక్‌టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ ఆర్. ప్రభాత్‌కుమార్, జిల్లా నాయకుడు ఆర్. జగన్నాథం, పట్టణ మాజీ అధ్యక్షుడు గాజుల నవీన్, నాయకులు పులుగు గోపాల్, వెంకటేశం, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దశంకరంపేటలో స్వచ్ఛందంగా వ్యాపార వాణిజ్య ఇతర సంస్థలు పాటించాయి. స్థానిక రామాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా యువకులు భారీర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచు అలుగుల సత్యనారాయణ, బీజేపీమండల అధ్యక్షుడు కోణం విఠల్, హిందూ సంఘాల ఐక్యవేదిక బాధ్యులు, ఆయా కులసంఘాల బాధ్యులు, వాణిజ్య వ్యాపార సంస్థల బాధ్యులు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. రేగోడులో హిందూ సంఘాల పిలుపు మేరకు మంగళవారం బంద్ ప్రశాంతంగా జరిగింది. రేగోడులో విద్యాసంస్థలు, వ్యాపార దుకాణాలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. హిందూ సంఘాలు ర్యాలీ నిర్వహించాయి.